క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. చిత్తూరు వాసులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

హుండీ ఆదాయం రూ 3.59 లక్షలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.3,59,183 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజులు తెలిపారు. శనివారం ఆలయం చిత్తూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుమన ప్రియ పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు చేపట్టినట్లు తెలిపారు. నాలుగు నెలలకు సంబంధించి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ.3,02,061, అన్నదానం హుండీ ద్వారా రూ.57,122 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు మైదా ఫ్యాక్టరీ సమీపంలో రక్తదాన శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్మైల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మనోజ్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు నగరం మైదా ఫ్యాక్టరీ ప్రాంతంలోని వావిహోమ్స్‌లో శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 7 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందన్నారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ఇంటి వద్దనే వైద్యసేవలు అందిస్తున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రక్షిత అన్నారు. చామంతిపురం గ్రామంలో శనివారం ఆమె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మంచాన పడ్డ రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించారు. బీపీ, షుగర్, గర్భవతులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఏఎన్‌ఎం శశికళ, ఎంఎల్‌హెచ్‌పీ యమున, ఆశావర్కర్ రాధ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ యూనియన్ రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్లు, డైరీలను చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు జయప్రకాష్ నాయుడు, దేవకి, రుక్మాంగద, బాబురెడ్డి, తులసీరామ్, పరంధామ తదితరులు పాల్గొన్నారు.

పొలానికి మార్గం సుగమం


దారి ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

బంగారుపాళెం: మండలంలోని తంబుగానిపల్లెలో శనివారం దారి సమస్యను పరిష్కరించినట్లు తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన రైతు బాబుమందడి తన పొలానికి దారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు రైతు పొలానికి దారి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ లావణ్య, వీఆర్‌ఓ సురేంద్ర, విలేజ్ సర్వేయర్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం వల్లే స్వేచ్ఛ, న్యాయం


శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలందరికీ సమానత్వం, సోదరభావం, న్యాయం, స్వేచ్ఛ రాజ్యాంగం వల్లే అందుతున్నాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటికి 74 ఏళ్లు అవుతున్న సందర్భంగా అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

భూములకు తప్పుడు పత్రాలు సృష్టించడం.. వాటిని బ్యాంకులో తాకట్టు పెట్టడం.. డబ్బులు దండుకోవడంలో పేరు మోసిన ముఠాకు తహసీల్దార్ కార్యాలయంలోని కింది స్థాయి సిబ్బంది సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే తహసీల్దార్ ఇటు పోలీసులకు, అటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేస్తున్నారు.


చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో జన సందడి

ఇంటి దొంగల పనే..?

చిత్తూరు అర్బన్ తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

- పోలీసులకు అందిన ఫిర్యాదు
- ఐదుగురిని విచారిస్తున్న పోలీసులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు తహసీల్దార్ సంతకం ఫోర్జరీ దందా నడిపించింది ఇంటి దొంగలే. బ్యాంకు రుణాల పేరుతో అమాయకులకు వల వేసి దోపిడీకి స్కెచ్ వేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి ఏకంగా మండల మేజిస్ట్రేట్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. ఈ ఫలితంగా లక్షలాది రూపాయలు వచ్చిపడ్డాయి. డబ్బు రుచి చూసిన ఈ ముఠా అదే పంథాను కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఓ నకిలీ పత్రం వెలుగుచూసింది. దీనిపై తహసీల్దార్ ఫిర్యాదుతో పోలీసుల వద్దకు చేరింది. పోలీసుల విచారణలో పలు విషయాలు వెలుగు చూస్తున్నాయి.

ఫోర్జరీ దందా ఇలా చేస్తున్నారు

తండ్రి, తల్లి పేరు చెప్పుకుని కొంత మంది కార్యాలయంలో వీఆర్‌ఏలుగా చెలామణి అవుతున్నారు. వీఆర్‌ఓ, కింది స్థాయి అధికారులు కొంత మంది వీరి చేతికి లాగిన్‌లు, రికార్డులు అప్పగించి గ్రామ స్థాయిలోని భూ సంబంధిత పనులు చేయించుకునేవాళ్లు. అలా మెదడుకు మేత పడిన ఈ వీఆర్‌ఏలు కొంత మంది కార్యాలయంలో పూర్తిగా పండిపోయారు. వీరు గ్రామ స్థాయిలో ప్రధానంగా భూ సమస్యలను తెచ్చిపెట్టి కాసుల వసూళ్లకు దిగేవారు. డబ్బులిచ్చేవారికి తప్పుడు పత్రాలు చేయించి అనుకూలంగా వ్యవహరించేవారు. ఇప్పుడు ప్రధానంగా డీకేటీ, గ్రామకంఠ భూములను రిజిస్ట్రేషన్ చేయించేందుకు తప్పుడు పత్రాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారు. ఈ భూములకు పక్కన ఉన్న సర్వే నెంబర్లు చూపి పత్రాలు సృష్టించడం, భూమే లేకుండా కూడా పత్రాలు తయారీ చేసి ఇవ్వడంలో వీరికే వీరి సాటి. ఈ పత్రాల (ఎంజాయిమెంట్ సర్టిఫికెట్) కోసం రూ.10 వేల నుంచి రూ.30వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. హద్దులు చూపించేందుకు మామూళ్ల మత్తులో తూగుతున్న ఓ సర్వేయర్ సాయం తీసుకుంటారు. ఆపై రిజిస్ట్రేషన్ చేసేందుకు ఈ ముఠాకు సంబంధం ఉన్న డాక్యుమెంట్ రైటర్లకు బాధ్యతలు అప్పగిస్తారు. అక్కడ కూడా రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసి ఇస్తుంటారు. ఆ తర్వాత బ్యాంకు రుణం ఇచ్చే వ్యక్తి వద్దకు ఈ పత్రాలను తీసుకెళ్లి రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రుణాలు తీసుకునేలా చేస్తుంటారు. ఇక్కడ కూడా 10శాతం కమీషన్ వసూలు చేస్తుంటారు. ఇలా ఇప్పటికే భారీ కుంభకోణం జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములకు సైతం అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు సృష్టించడం ద్వారా రూ.లక్షల్లో డబ్బులు తీసుకుంటున్నట్లు తెలిసింది.

దళారులకు ఆదాయ వనరుగా..

చిత్తూరు నగరంలో అర్బన్, రూరల్ మండలాల తహసీల్దార్ కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయాలకు నిత్యం వివిధ పనుల నిమిత్తం వేలాది మందిగా తరలివస్తుంటారు. వీరిని ఆసరాగా చేసుకుని కొంత మంది దళారులు కార్యాలయాల్లో రెచ్చిపోతుంటారు. పనికి తగ్గట్టు రూ.1000 నుంచి రూ.10 వేల వరకు డబ్బులు తీసుకుని ఆ పనిచేసి పెడుతుంటారు. ఇలా దళారులకు ఈ కార్యాలయాలు పెద్ద ఆదాయ వనరులుగా మారిపోయాయి. గతంలో పనిచేసిన కొంత మంది వీఆర్‌ఓలు, అధికారులు వారి చేతికి మరక అంటించుకోకుండా ఉండేందుకు ఈ వ్యవస్థను పెంచి పోషించేశారు. ఇంత వరకు ఒక్క ఎత్తయితే కార్యాలయంలో పనిచేసే వీఆర్‌ఏలు, ప్రైవేటు వ్యక్తుల అక్రమాలు భారీ స్థాయిలో జరుగుతున్నాయి. పెద్ద పెద్ద డీల్ సెట్టి చేసి లక్షల్లో ఆదాయం గడించేందుకు దందాను మొదలు పెట్టారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఫోర్జరీ వెలుగులోకి వచ్చింది ఇలా

రిజిస్ట్రార్ వద్దకు వెళ్లిన ఓ ఎంజాయిమెంట్ పత్రం సబ్ రిజిస్ట్రార్ కంట పడింది. ఆ పత్రంలో తహసీల్దార్ సంతకంపై అనుమానం కలగడంతో ఆ పత్రాన్ని రెవెన్యూ అధికారులకు పంపారు. దీంతో అసలు విషయం బయటపడింది. తహసీల్దార్ కళావతి తన సంతకం ఫోర్జరీ చేశారని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులతో విచారణ ప్రారంభమైంది. రెండు రోజుల పాటు ముగ్గురు వీఆర్‌ఓలు, ఓ యువతి, ప్రముఖ ఫైనాన్స్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు కార్యాలయ అధికారులు చెబుతున్నారు. తహసీల్దార్ సీళ్లు ఎక్కడ తయారు చేశారో తెలుసుకోవడానికి పోలీసులు వారిని తమిళనాడులోని వేలూరుకు తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో ఒకరిపైనే నిందలు వేసి, మరో ముగ్గురిని తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారని, అసలు దొంగలనే వదిలేస్తే ఎలా అని కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. వీళ్లను వదిలేస్తే కుంభకోణం మరింత పుంజుకుంటుందని వారు అంటున్నారు. తీరా ఈ ఫోర్జరీ దందా కలెక్టర్ వద్దకు చేరింది. తహసీల్దార్ కళావతి ఈ కేసుకు సంబంధించి మరో ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిసింది. కొంత మంది కూటమి నేతలు మాత్రం వారిని ఈ కేసు నుంచి తప్పించాలని పట్టుగా కూర్చున్నారనే చర్చ సాగుతోంది.


తహసీల్దార్ ఫోర్జరీ సంతకంతో వెలుగు చూసిన పత్రం

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో సేవలందిస్తున్న పశు వైద్యాధికారులు

గుడిపాల: పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని పశు వైద్యాధికారులు రవితేజ, సాయిసుధ తెలిపారు. మండలంలో సీఎం కొత్త యిండ్లు, డిబి పల్లెలో శనివారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాల దిగుబడి బాగా రావాలంటే పాడి పశువులకు మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం 302 పాడిఆవులు, దూడలను డీవార్మింగ్, పిడుదుల నివారణకు స్ప్రే చేశారు.

250 పశువులకు వైద్యసేవలు


పశువులకు వైద్యం చేస్తున్న పశువైద్యాధికారులు

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లెలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.శిబిరంలో 250 ఆవులకు పిడుదుల మందు, నట్టలనివారణ మందును తాగించారు. గర్భకోశవ్యాధులకు సంబంధించి 57 పశువులను పరీక్షించి వైద్యం చేయించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ హరీఫ్, ఏపీఎల్‌డీ డీడీ డాక్టర్ సుబ్బారావు, ఏడీలు డాక్టర్ పద్మ, డాక్టర్ విజయమోహన్, తవణంపల్లె పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య, గోపాల మిత్రలు తులసీపతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గణతంత్ర కాంతులు


గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను విద్యుత్‌కాంతులతో ముందస్తుగా ముస్తాబు చేశారు. జాతీయజెండా రంగులతో లైట్స్ వేసి చూడముచ్చటగా సిద్ధం చేశారు. ఈ వెలుగులు ప్రయాణికులను, చూపరులను కట్టిపడేస్తున్నాయి.
– చిత్తూరు కార్పొరేషన్

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి


మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్ : వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ కుటుంబాన్ని గుర్తు పెట్టుకుని ఏకాగ్రతతో నడపాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు నగరంలోని సంసిద్ధ్ క్యాంపోర్డ్ పాఠశాలలో శనివారం 36 వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. డీటీసీ నిరంజన్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మాట్లాడుతూ వాహనాల కండీషన్‌ను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. లైసెన్స్ లేని డ్రైవర్ చేతికి పాఠశాల వాహనం ఇవ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ రాజేశ్వరరావు, సంసిద్ధ్ క్యాంపోర్డ్ కరస్పాండెంట్ మహేశ్‌రెడ్డి, డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు మద్యం, మాంసం విక్రయాల నిషేధం

చిత్తూరు అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చిత్తూరు నగరంలో మద్యం, మాంసం ఎక్కడా విక్రయించకూడదని డీఎస్పీ సాయినాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని మాంస విక్రయ కేంద్రాలు, చేపల విక్రయ కేంద్రాలు, మద్యం దుకాణాలు మూసేయాలని ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గోవింద భక్తుల పాదయాత్ర


తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న శివాడి గ్రామస్తులు

బంగారుపాళెం: గోవింద భక్తుల పాదయాత్ర శనివారం మండల కేంద్రానికి చేరుకుంది. పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చెందిన గోవింద భక్తులు 150 మంది గురుస్వామి లక్షుమయ్య ఆధ్వర్యంలో తిరుమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ, శుక్రవారం మధ్యాహ్నం పాదయాత్రగా బయలుదేరామన్నారు. రాత్రి మొగిలి శివాలయం ఆవరణలో బసచేశామన్నారు. శనివారం ఉదయం తిరిగి పాదయాత్ర ప్రారంభించామని చెప్పారు. శనివారం రాత్రి కాణిపాక వినాయకస్వామి వారిని దర్శించుకుని ఆదివారం తిరుమలకు బయలుదేరుతామన్నారు. ప్రతి ఏటా కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పాదయాత్రగా వెళ్తున్నట్లు వివరించారు. పాతికేళ్లుగా శివాడి గ్రామం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్నామన్నారు.

జెడ్పీ సీఈఓ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్

పలమనేరు : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు రికార్డులను జెడ్పీ సీఈఓ రవికుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలో సాగుతున్న పనులు తదితరా అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ ఖాదర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం


నాలుగు రోడ్ల కూడలి వద్ద ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

బంగారుపాళెం: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం అని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ రహదారి మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ, 18 ఏళ్లు పూర్తయిన వారందరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని బూత్‌లెవల్ అధికారులు (బిల్‌వోలు) వద్ద ఓటరు నమోదు ఫారాలను పూర్తి చేసి అందజేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, సమాజాన్ని ప్రగతి బాట దిశగా తీసుకువెళ్లే శక్తి ఓటుకు ఉందన్నారు. అలాంటి ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోకుండా సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేంద్ర, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వందనాత్రిపాఠి సమాజంలో ఎన్నికల ప్రభావం, ఓటు హక్కు ప్రాధాన్యత, యువత పాత్ర, ఎన్నికల వ్యవస్థలో భవిష్యత్తులో చోటు చేసుకునే సంస్కరణలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాగిమానుపెంట జెడ్పీ హైస్కూల్లో..

మండలంలోని ఎగువరాగిమానుపెంట పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రహంతుల్లా మాట్లాడుతూ, ఓటు విలువైందని, ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇరసయ్య, శ్రీనివాసులు, శారద, మురగయ్య, బాబునాయుడు, ఉషారాణి, భారతి, జయంతి, సత్యం, దశరథ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ

తవణంపల్లె: మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. హై స్కూల్ నుంచి తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబు, ఏపీఎం రవి, హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం టి.పుత్తూరు రోడ్డులో మానవహారం నిర్వహించారు. తవణంపల్లె హైస్కూల్లో సీనియర్ సిటిజన్లను సత్కరించారు. ఓటు హక్కు గురించి వివరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ వెంకటరమణ, ఆర్‌ఓ జీవన్‌సాగర్, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బంగారుపాళెంలో ఓటరు దినోత్సవ అవగాహన ర్యాలీ


తవణంపల్లెలో ఓటరు అవగాహన ర్యాలీ

యాంత్రీకరణతో తక్కువ పెట్టుబడి


వరి నాట్లను పరిశీలిస్తున్న ఏఓ హేమలత

కార్వేటినగరం : వ్యవసాయం యాంత్రీకరణతో పెట్టుబడి తగ్గించుకోవచ్చని ఏఓ హేమలత తెలిపారు. శనివారం ఆర్కేవీబీపేటలో రైతు శ్రీహరి వ్యవసాయ పొలంలో యంత్ర సాయంతో వేస్తున్న వేసిన వరి నాట్లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ కూలీల సమస్యను అధిగమించేందుకు యాంత్రీకరణ ఉపయోగపడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణం సాగు చేసుకోవచ్చని సూచించారు. అలాగే దుక్కి దున్నేందుకు రోటావేటర్లు, వరి విత్తడానికి డ్రమ్ సీడర్లు కూడా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అనంతరం వరినాట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి గాయత్రి పాల్గొన్నారు.

